# ఘోరరోడ్డు ప్రమాదం

## కారును ఢీకొన్న బస్సు
## ఇద్దరు మహిళలు మృతి- మరో ఇద్దరికి గాయాలు



కారును ఢీకొన్న బస్సు, నుజ్జునుజ్జు అయిన కారు, మృతి చెందిన సావిత్రి, సంగీత

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 14, ప్రభాతవార్త

తిరుపతి బైపాస్ రోడ్డులో ఆర్సి పురం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలు పాలైన సంఘటన గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ ముత్యాలరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ సిఐ చిన్న గోవిందు వివరాల మేరకు ఇలా ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మి నగర్ క్షత్రియ ఎన్‌క్లేవ్ అపార్ట్మెంట్‌లో ప్లాట్ నెంబర్ 101లో నివాసం ఉంటూ బిల్డర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌రాజు నూతన గృహ ప్రవేశం వేదాంతపురం పంచాయితీ ఎంజి బ్రదర్స్ లేఅవుట్‌లో తెల్లవారుజామున 4 గంటలకు ఉండడంతో పుల్లంపేట మండలం, రంగంపల్లి నుండి అతని తల్లి సావిత్రి (80), అతని చెల్లెల్లు, అక్కలు వచ్చారు. వారందరు ధనలక్ష్మి నగర్ క్షత్రియ అపార్ట్మెంట్ నుండి ఉదయం 3.30 గంటలకి కారులో బయలుదేరి ఆర్‌సిపురం సర్కిల్ వద్ద హైవే రోడ్డు దాటుతుండగా నల్గొండ నుండి బెంగళూరు వైపు వెళ్తున్న బాలాజీ ట్రావెల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొని కొద్ది దూరం ఈడ్చుకుని వెళ్లింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ అందరిని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ పుల్లంపేట మండలం రంగంపల్లికి చెందిన రాజశేఖర్ రాజు తల్లి సావిత్రి, అతని చెల్లెల్లు ఒంటిమిట్ట రాచపల్లికి చెందిన సంగీత (38) హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని ఇద్దరు చెల్లెల్లు జ్యోతి, లక్ష్మిదేవిలకు గాయాలయ్యాయి. ప్రమాదానికి బస్సు డ్రైవర్ ఎ.సురేష్ కారణమని తెలుస్తోంది. ప్రమాదానికి గురైన కారు డ్రైవర్, రాజశేఖర్ సహచరుడు. చెన్నైకి చెందిన సంజయ్ రాఘవ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్యాలరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ సిఐ చిన్న గోవిందు కేసు నమోదు చేసి బస్సు డ్రైవర్ అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# స్మశానికి చేరాలంటే నరకయాతన

## -ఇదీ మెగా కంపెనీ నిర్వాకం అంటున్న గ్రామస్తులు



పంటపొలాల్లో నుంచే మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

తొట్టంబేడు, నవంబర్ 14 ప్రభాతవార్త

బతికుండగా ప్రశాంతంగా లేని జీవితం చచ్చినా కూడా ప్రశాంతంగా స్మశానికి పోవాలంటే అన్ని ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. మండలంలోని పలు గ్రామాలకు స్మశానికి దారిలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో స్మశానికి వెళ్ళాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారు. మెగా కంపెనీ చేపట్టిన ఆరులైన్ల రహదారి నిర్మిస్తున్నారు. ఈమార్గంలో ఎక్కడ ఏగ్రామాలు ఉన్నాయో కనీసం బోర్డులు ఏర్పాటు చేయడంలో కూడా పూర్తిగా విఫలమయ్యారు. ఇక సమీపంలోని పొయ్య గ్రామ స్మశానాన్ని పూర్తిగా ఆక్రమించేసి రోడ్డు నిర్మించారు. సాధారణంగా ఆరులైన్ల రోడ్డు పరిధిలో సర్వీసురోడ్డు వద్ద గ్రామాలకు వెళ్ళే బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇక గ్రామాలకు చేరుకోవాలంటే చిన్నారులు, ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం గ్రామంలో ఒకరు మృతిచెందడంతో స్మశానానికి వెళ్ళడానికి సిద్దమవగా మెకాళ్ళలోతు నీరు బురదమయమై ప్రజలు నరకయాతన పడ్డారు. ఇక స్మశానికి పంటపొలాల్లో నుంచి తీసు కెళ్ళడం కనిపించింది. ఈసంఘటపై గ్రామస్తులు మెగా కంపెనీ నిర్వాహకుల తీరుపై మండి పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# కాణిపాకంలో ముగిసిన పవిత్రోత్సవాలు

## -శాస్త్రసోక్తంగా పూర్ణాహుతి, స్వామివారికి అభిషేకం

కాణిపాకం, నవంబర్ 14 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు గురువారం జరిగిన మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసనం, స్వామి వారికి అభిషేకం తదితర పూజాధి కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయ అలంకార మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద ఆలయ అర్చకులు,రుత్వికులు ఉదయం 5.30 గంటలకు అపబృద యాగపూజ, స్థండిల మండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, మహా పవిత్ర సమర్పణ,విశేష ద్రవ్యాహుతి, మహాపూర్ణాహుతి, విశేష ద్రవ్యాహుతి, మహా పూర్ణాహుతి, మహా దీపారాధన, యాత్రాదానము, కంబచం ఢీయాగం, దీపారాధన, ప్రసాద వినియోగం తదితర పూజాధి కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పవిత్ర ఉత్సవాల సందర్భంగా అలంకార మండపం వద్ద ఏర్పాటు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించిన ప్రధాన కలశాన్ని మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు ప్రధాన ఆలయంలోకి తీసుకువెళ్ళి కలశంలోని పవిత్రజలంతో స్వామివారి మూల విరాట్‌కు స్థనాబిషేకం నిర్వహించారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





# తండ్రి తాగుడు మానలేదని కుమార్తె బలవన్మరణం

తడ, నవంబర్ 14 ప్రభాతవార్త



తడ మండలం రామాపురం పంచాయతీ పరిధిలోని స్వామిరెడ్డి కండ్రిగకు చెందిన కె.సుధ (48) బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తన తండ్రి కుటుంబాన్ని పట్టించుకోకుండా మద్యానికి బాని సైన కారణంగా మనస్తాపానికి గురైన సుధ బుధవారం ఆత్మహత్యకు పాల్పడగా, గురువారం మృతిచెందింది. సుధ కుమారుడు ప్రేమ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె తండ్రి లారీడ్రైవర్‌గా పనిచేస్తూ గతంలో తాగుడుకు బానిస అయ్యాడని, ఆ తర్వాత అనేకమార్లు సర్దిచెప్పగా గత ఏడాదిన్నరగా తాగుడు మానేసి బుద్ధిగా ఉండేవాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే బుధవారం కూతురు వద్ద రూ.500 ఖర్చులకని చెప్పి తీసుకొని కూలీ పనికి వెళుతున్నానని చెప్పి.. వెళ్లకుండా మళ్లీ తాగుడు మొదలుపెట్టడంతో సుధ మనస్తాపానికి గురయింది. మేకల దొడ్డిలోకి వెళ్లి చీరతో ఉరేసుకుంది. గ్రామస్థులు ఆమెను చెన్నై తరలించినప్పటికీ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆ మండలాల్లో 'కిక్కే కిక్కు'!

## మద్యంషాపులకు అనుబంధంగా తాగిస్తున్నారు!! అనధికార బెల్టుషాపులు వ్యాపారం

ప్రభాతవార్తన్యూస్‌నెట్‌వర్క్-తిరుపతి:

ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా తిరుపతి జిల్లాలోని కొన్ని మండలాల్లో ఏకంగా అనధికార మద్యం బెల్టుషాపులు నడుపుకుంటూ వ్యాపారం చేస్తున్నారనే సమాచారం గుప్పుమంటోంది. ఆ మండలాల్లో మందుబాబులకు కిక్కేకిక్కుగా మారిందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం షాపులు లైసెన్స్‌పొందిన యజమానులు మందుబాబులకు మద్యం అమ్మకాలు మాత్రమే చేయాలి. అయితే అక్కడే కొన్ని చోట్ల మద్యం షాపులకు అనుబంధంగా తాత్కాలిక షెడ్డులు ఏర్పాటుచేసి మద్యం తాగిస్తున్నారు. అంతేగాక జిల్లాలోని పలు మండలాల్లో అనధికారికంగా బెల్టుషాపులు నడుపుతున్నారనేది సమాచారం. వీటిపై ఆయా మండలాల ప్రజలు ఏకంగా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడం ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా తిరుపతి రూరల్, ఆర్‌సిపురం,



చంద్రగిరి, భాకరాపేట, యర్రావారిపాళం, పాకాల,రేణిగుంట మండలాల్లో మద్యం షాపులకు అనుబంధంగా చిన్నపాటి షెడ్లను వేసి అక్కడే తాగిస్తుండటం, ఇంకా బెల్టుషాపులు వెలిశాయనేది ఫిర్యాదులు. దీనివల్ల ప్రజల మధ్య గొడవలు, మద్యం మత్తులో పలు రకాల నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమువుతోంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం లేకపోలేదు. అనధికార బెల్టుషాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఎక్కడబడితే అక్కడ మద్యంసేవించి కిక్కుతో తూలుతున్నారు. మద్యం షాపులకు అనుబంధంగా తాత్కాలిక షెడ్లు, అనధికార బెల్టుషాపులపై అటు ఎక్సైజ్ పోలీసులుగానీ, ఇటు ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో లాఅండ్ఆర్డర్ పోలీసులు గానీ చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరీ వీటన్నిటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అనధికార బెల్టుషాపులను మూయించాలని ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికే జిల్లా ఎస్పీకి కూడా అనధికార బెల్టుషాపులపై ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది.

# నిర్లక్ష్యం వద్దు.. బాధ్యతగా పనిచేయండి

## రెండు రోజులుగా గురుకులంలో జ్వరాలు
## - నిర్లక్ష్యం చేసిన సిబ్బందిపై కలెక్టర్ వెంకటేశ్వర్లు ఫైర్

సత్యవేడు, నవంబరు 14 ప్రభాతవార్త:

సత్యవేడు మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే బాలుర బీసీ గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థులు తీవ్రమైన జ్వరాలతో బాధపడుతున్న ఘటన చోటు చేసుకుంది. ఈ పాఠశాలలో గత రెండు రోజులుగా దాదాపు 40 మంది విద్యార్థులు తీవ్రమైన జ్వరంతో ఇబ్బందులు పడుతున్నప్పటికి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, స్టాఫ్‌నర్సులు నిర్లక్ష్యం వహించడంతో జ్వరం ప్రబలి గురువారం ఉదయం 5 గంటలకు ముగ్గురు విద్యార్థులకు తీవ్ర అస్వస్థతకు రావడాన్ని బట్టి పిల్లలను స్థానిక వైద్యశాలకు తరలించే క్రమంలో విషయం అందుకున్న పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సురేష్‌కుమార్, హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను విచారణ చేయగా అనేకులకు పాఠశాలలో తీవ్రమైన జ్వరమని తెలుసుకుని వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి పాఠశాలలో జ్వరంతో ఉన్న పిల్లలను స్థానిక ప్రభుత్వ వైద్యశాలల్లోకి తరలించి చికిత్స అందించడం జరిగింది. అయితే తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ముగ్గురు విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక చికిత్సలు ఇవ్వగా శివకుమార్ 6వ తరగతి విద్యార్థిని మాత్రం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్థానిక వైద్యశాలను సందర్శించి జ్వరంతో ఇబ్బంది పడుతున్న పిల్లలను పరామర్శించి వైద్యులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



చికిత్స పొందుతున్న విద్యార్థులను విచారిస్తున్న జిల్లా కలెక్టర్

### న సంఘటనపై ఆరా తీసిన కలెక్టర్

జరిగిన సంఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, స్టాఫ్ నర్సు, వైద్యాధికారులతో చర్చించి జరిగిన సంఘటనకు పాఠశాల ప్రిన్సిపాల్ స్టాఫ్ నర్సు కారణమని నిర్లక్ష్యాన్ని బట్టి పిల్లలు ఇబ్బంది పడ్డారని తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. అనంతరం పాఠశాలలోని మరుగుదొడ్లు పరిశుభ్రమైన పరిస్థితిలో ఉండడాన్ని వీడియో ద్వారా గమనించిన కలెక్టర్ వెంటనే శుభ్రపరచి వాటి పునర్నిర్మాణానికి ప్రణాళిక చేయాలని డీడీ వారిని ఆదేశించారు.

### న పాఠశాలను సందర్శించిన జిల్లా వైద్యాధికారి శ్రీహరి

ఘటనపై స్పందించిన డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్యాధికారిగా సంబంధిత పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో 60 మరుగుదొడ్లను పరిశీలించగా సత్యం కాని దుర్వాసనతో అపరిశుభ్రమైన స్థితిలో ఉన్న మరుగుదొడ్లను చూసి చలించిపోయారు. వెంటనే వీటిని శుభ్రపరచాలని స్థానిక ఎంపీడీవో వారిని కోరారు.

## చిత్తూరు దాహార్తి తీర్చడానికి

# అడవిపల్లి రిజర్వాయర్ నీరు

### - 0.785 టిఎంసిల నీరు కేటాయిస్తూ జిఓఆర్టీనెం.395 జారీ
### - ఫలించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు కృషి

చిత్తూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:

చిత్తూరు నగర ప్రజల దాహార్తి తీర్చడానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. చిత్తూరు ప్రజల మంచినీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కరించడానికి అడవిపల్లి రిజర్వాయర్ నుండి 0.785 టిఎంసిల నీటిని కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం జిఓఆర్టీనెం.395 జారీ చేసింది. చిత్తూరు నగర నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం పక్కా చర్యలు తీసుకుంటామని ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. చిత్తూరు నగరానికి ఇప్పటికే పెనుమూరు మండలం కలవగుంట వద్ద నిర్మించిన ఎన్టీఆర్ జలాశాయం నుండి నీరు సరఫరా అవుతుంది. అయితే వేసవికాలంలో ఎన్టీఆర్ జలాశయంలో నీరు అడుగంటిపోవడతో చిత్తూరు నగర ప్రజలకు మంచినీటి కష్టాలు తప్పేవి కావు. ఈ మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నిర్ణయించిన గత మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గాలు అడవిపల్లి రిజర్వాయర్ నుండి పైపులైన్ల ద్వారా చిత్తూరుకు మంచినీటిని తరలించి పరిష్కరించాలని నిర్ణయించి పనులు చేపట్టారు. అయితే అడవిపల్లి రిజర్వాయర్ నుండి చిత్తూరు నగర ప్రజలకు ఏ మేరకు నీరు కేటాయించాలనే విషయంపై స్పష్టత ఇవ్వలేకపోయాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గురజాల జగన్మోహన్‌నాయుడు చిత్తూరు నగర ప్రజల దాహార్తిని పూర్తి స్థాయిలో పరిష్కరించాలని నిర్ణయించి అడవిపల్లి రిజర్వాయర్ నుండి 0.785 టిఎంసిల నీటిని కేటాయిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు ఇప్పించారు. అడవిపల్లి రిజర్వాయర్ నుండి చిత్తూరు వరకు పైపు లైన్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రభుత్వం కేటాయించిన మేరకు నీటిని తీసుకురావడానికి మున్సిపల్ అధికార యంత్రాంగం వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

# నేటి నుంచి సిబ్బంది సెల్‌ఫోన్లు డిపాజిట్ చేయాల్సిందే!

## ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు



శ్రీకాళహస్తి,నవంబర్ 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం ఇఓగా బాధ్యతలు స్వీకరించిన టి.బాపిరెడ్డి వారం రోజుల పాటు క్షుణ్ణంగా ఆలయంలో పరిశీలించిన తరువాత సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నేపధ్యంలో శుక్రవారం నుంచి ఆలయంలోపలకు సిబ్బంది,అధికారుల సెల్‌ఫోన్లను కూడా అనుమతించకుండా ప్రత్యేక కౌంటర్‌లో డిపాజిట్‌చేయాలని ఇఓ ఆదేశించారు. దాంతో ఆఘమేఘాల మీద ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. అ లయంలో పారిశుద్ధ్యం కోసం ప్రత్యేకంగా నెల్లూరు మున్సిపాలిటినుంచి ఓ అధికారిని శానిటరీ ఇన్స్పెక్టర్‌గా వచ్చారన్నారు.కార్‌పార్కింగ్ వద్ద ఉన్న కొందరు దళారులకు,ఆలయంలో పనిచేసే వారితో సన్నిహిత సంబంధాలుండటం వల్ల శివయ్య హుండీలో పడాల్సిన సొమ్ములు దళారులు,ఆలయంలో పని చేసే కొందరు పంచుకుంటున్నట్లు గుర్తించి సెల్‌పోన్లు నిషేధాన్ని అమలు చేయటానికి చర్యలు తీసుకున్నారు.ఈ మేరకు ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఇఇ మురళీధర్‌రెడ్డిలకు బాధ్యతలు అప్పగించారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి

## : జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్

నారాయణవనం, నవంబర్ 14 ప్రభాతవార్త :

సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రభుత్వం మంజూరు చపట్టిన అభివృద్ధి పనులకు సంబందించి సంబందిత గుత్తేదారులు నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ తెలిపారు. గురవారం పాలమంగళం దక్షణపుకండ్రిగ పంచాయతీ బిసికాలనీలో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే చేపట్టే పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులకు జాతీయ గ్రామీణా ఉపాధిహామి పథకానికి అనుసందానం చేయడం వల్ల బిల్లులు కూడా ఆలస్యం లేకుండా ఖాతాల్లో పడుతుందన్నారు. చేపట్టే పనుల్లో నాణ్యత లేకపోతే బిల్లులు రావడం కష్టమన్నారు. కావున అధికారులు కూడా పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతలో చేపట్టాలన్నారు. పాలమంగళందక్షణపుకండ్రిగలో వేసిన సిమెంట్ రోడ్డులో నాణ్యత వుందని సంతృప్తి వ్యక్త పరిచారు.

# ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ధర్నా

గూడూరు, నవంబర్ 14 ప్రభాతవార్త

గూడూరులో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా ఈనెల 8వ తేదీ నుండి 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పోరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా గూడూరు డివిజన్ లోని ప్రజల సమస్యలను నాయకులు తెలుసుకొని ఆ సమస్యల పరిష్కారం కోసం గురువారం గూడూరు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, విద్యుత్ చార్జీలలో వచ్చే ట్రూ ఆఫ్ సర్ చార్జీలు, రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎలాంటి విద్యుత్ ఛార్జీలు పెంచమని అని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాట తప్పడం మంచిది కాదని వారు అన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని వాటిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇసుక అందరికీ అందుబాటులోకి తేవాలని, వారి డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని, అలాగే ఒకటో పట్టణం నుండి రెండవ పట్టణానికి కలుపుతూ వేస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి గత కొన్ని ఏళ్లుగా నిర్మాణ లోపంతో మధ్యలో ఆగిపోవడం ప్రభుత్వాలు మారడం వంటి కారణాలతో నత్తనడక నడుస్తూ పలు అధికారులు, పాలకులు, నిర్మాణాలు, శంకుస్థాపనలు చేసినా పూర్తిగా నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు రెండవ పట్టణానికి వెళ్లాలంటే అండర్ బ్రిడ్జి కింద నిత్యం ట్రాఫిక్ జామ్ తో గంటలకు కొద్దీ ఆగిపోవడం ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారని వెంటనే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అంబేద్కర్ భవనం శిధిలావస్థకు చేరుకొని చాలా కాలమైందని, దానిని పునర్నిర్మాణం చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గతంలో ఆర్డీవోకి వినతిపత్రం సమర్పించడం జరిగిందని, ఆర్డీవో నూతన అంబేద్కర్ భవనానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందని, త్వరలో నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఆ హామీ అలాగే




నిలబడిపోయిందని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అంబేద్కర్ నూతన భవన నిర్మాణానికి పాలకులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని వారు తెలియజేశారు. నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలన్నారు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇవ్వాలన్నారు అదేవిధంగా గూడూరు చల్లకాలువ వద్ద ఉన్న స్మశాన వాటికను అభివృద్ధి చేయాలన్నారు. జెమిలి ఎన్నికలు వల్ల అందరికీ మంచి జరుగుతుందన్నారు. అనంతరం ఏ.ఓకి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, టి.వెంకటరామిరెడ్డి, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, ముత్యాలయ్య, పామంజి మణి, ఏ.ప్రసాద్, ఏ.చంద్ర మోహన్, బి. చంద్రయ్య, నారాయణ వెంకటయ్య, పుట్టా శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జవాబుదారీతనం ..
# వ్యవస్థ సంరక్షణ .. జీరో ట్రిప్పింగ్

## చంద్రగిరి సబ్ డివిజన్ నంబర్ వన్ స్థానంలో నిలవాలి..!
## ఉమ్మడి జిల్లా ఎస్ఈ ఆపరేషన్స్ సురేంద్ర నాయుడు

చంద్రగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త:



విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఉమ్మడి జిల్లా ఎస్ఈ ఆపరేషన్స్ సురేంద్ర నాయుడు అన్నారు. స్థానిక సబ్ డివిజన్ సబ్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. సబ్ స్టేషన్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన సబ్ స్టేషన్‌ను మరమత్తులు చేపట్టి నూతన సబ్ స్టేషన్ వలే తీర్చిదిద్దాలని అన్నారు. వ్యవస్థను సంరక్షించుకోవడం మీ బాధ్యత అన్నారు. టౌన్ పరిధిలో జీరో ట్రిప్పింగ్ అమలు చేయాలనీ, తద్వారా నష్టాలను తగ్గించుకోవాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సేవలతోనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కేబుల్ ఆపరేటర్లు తమ కనెక్షన్లు తెగిపడినప్పుడు వెంటనే సదరు కేబుల్‌ను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా లైన్ రెడీ చేసుకోవాలన్నారు. కేబుల్ ఆపరేటర్లతో సమావేశమై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఆరేపల్లి రంగంపేటకు 24 గంటలు విద్యుత్‌పై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఆర్డీఎస్ఎస్ ద్వారా సంక్రాంతి నాటికి 24 గంటలు విద్యుత్ అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాధనలు సిద్ధం చేసి పంపాలని రూరల్ ఏఈ వెంకటరమణను ఆదేశించారు. సూర్యఘర్ సోలార్ పథకంలో కేంద్ర ప్రభుత్వం కిలోవాట్‌కు రూ.30 వేలు వంతున రెండు కిలోవాట్స్‌కు రూ.60 వేలు, మూడవ కిలో వాట్ రూ.18 వేలు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. డిఈ వాసురెడ్డి, ఏడిఈ శేషాద్రి రెడ్డి, ఏఈలు వై.నాగరాజు, పి.నీలకంఠయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు కార్యాచరణపై తుది నిర్ణయం తీసుకుంటా



**కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించిన తన భవిష్యత్తు కార్యాచరణపై తుది నిర్ణయం తీసుకుంటానని మహాజన సోషలిస్ట్ పార్టీ నేత దేవరాజు మాదిగ పేర్కొన్నారు. తన వ్యక్తిగత కారణాలు, అనారోగ్య సమస్యలతో పార్టీలో పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. తన గుర్తింపుకు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందక ృష్ణ మాదిగ కారణమని ఆయనకు పాదాభివందనాలు తెలుపుతున్నట్లు చెప్పారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## యువతరంగం సాంస్కృతిక పోటీల్లో నిరంజన్ ప్రతిభ



**చిత్తూరురూరల్, నవంబరు 14 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, పివికెయస్ ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలలో ప్రథమ సంవత్సరం బియస్సీ కంప్యూటర్ సైన్సు చదువుతున్న ఇ.నిరంజన్ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన యువతరంగం 2024 సాంస్కృతిక పోటీలలో స్పాట్ పెయింటింగ్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ జ్యోతి తెలిపారు. నిరంతరం శ్రమిస్తూ కష్టపడి చదివే విద్యార్థులు ఎల్లప్పుడు అన్ని పోటీలలో ముందుంటారని తెలిపారు. కాగా విద్యార్థి నిరంజన్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ మీరాసాహెబ్, కల్చరల్ కోఆర్డినేటర్ డా.పి. జయచంద్రుడు ఇతర అధ్యాపకులు అభినందించారు.

## జాబ్‌డ్రైవ్‌లో 40మంది ఎంపిక

**చిత్తూరురూరల్, నవంబరు 14ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణం, సీతమ్స్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఆకార్డ్ హెచ్‌ఆర్ సొల్యూషన్ కంపెనీ నిర్వహించిన పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో 40మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.న. వెంకటాచలపతి తెలిపారు. బుధవారం నిర్వహించిన ఈ జాబ్ డ్రైవ్‌లో సీతమ్స్ కళాశాల విద్యార్థులతో పాటు వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎస్వీసెట్ కళాశాలకు చెందిన సుమారు 70మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్‌చైర్మెన్ టి.రంగనాధం, మేనేజింగ్ ట్రస్టీ డా. డి.ఏ, కల్పజ, సెక్రటరీ డి.కె.బద్రీనారాయణ, డీన్ అకడమిక్స్ డా.ఎం.శరవణన్, డీర్ ఆర్అండ్ డి డా. సాంబశివరావులతో పాటు కళాశాల అధ్యా పకులు అభినందించారు. కాగా ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను మెకానికల్ విభాగం అధిపతి సతీష్‌కుమార్, ప్లేస్ మెంట్‌కోఆర్డినేటర్‌యుగంధర్‌ఇతర డిపార్టుమెంట్ అధ్యాపకులు విజయవంతంగా నిర్వహించడం జరిగింది.

## ఘనంగా బాలల దినోత్సవం

పాలసముద్రం, నవంబర్ 14 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలంలో గురువారం బాలల దినోత్స వంను ఘనంగా నిర్వహించుకున్నారు. బలిజకండ్రిగ ఎస్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠ శాలలో ఎంఇఓ గిరిజ ఆధ్వర్యంలో బాలల దినోత్స వం జరుపు కున్నారు. విద్యార్థులు నాయకుల వేషాధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాపోటీలు నిర్వహించి విజయం సాధించిన విద్యార్థులకు ఎంఇఓ గిరిజ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ రఘు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాలు చదవడమే కాదని, ఆటలు, పాటలు, చిత్రలేఖనం, తదితరాలు నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా వుండి పుస్తకాలకు దగ్గరగా వుండాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా స్టేషన్ డిఎస్పీగా విజయశేఖర్ బాధ్యతలు స్వీకరణ



**చిత్తూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:** చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ డిఎస్పీగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన డిఎస్పీల బదిలీల్లో చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ డిఎస్పీగా విజయశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పోలీసు కార్యాలయంలో అప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న డిఎస్పీ విజయశేఖర్ చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ డిఎస్పీగా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

## తహసిల్దారు కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

బంగారుపాళ్యం, నవంబర్ 14 ప్రభాతవార్త:



స్థానిక తహసిల్దారు కార్యాలయం ఎదుట గురువారం సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని ఆరోపించారు. విద్యుత్ ట్రూఅఫ్ చార్జీల పేరిట 20 వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారం వేయనున్నారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ సిపిఎం పార్టీ నాయకులు మురళీ మాట్లాడుతూ మండల పరిధిలో పలు భూసమస్యలు వున్నాయని రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సాగు భూములు, ఇంటి పట్టాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రెవెన్యూ అధికారులకు భూఆక్రమణలపై పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఎస్టీలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శంకరాచ్చారి, హేమంత్‌బాబు, సుబ్రమణ్యం, మంజునాథ్, గోపి, రామయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## జడ్పీలో 20 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

**చిత్తూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ పరిధిలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 20 మందిని సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీ కార్యాలయ పరిధిలో గత కొంతకాలంలో ఉద్యోగుల పదోన్నతులు జరుగలేదు. దీంతో ఒకే స్థానంలో ఏళ్ళ తరబడి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జడ్పీ సిఇఓగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌నాయుడు ఉద్యోగుల పదోన్నతులపై దృష్టి సారించి అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

## ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం

**పూతలపట్టు, నవంబర్ 14 ప్రభాతవార్త:** పూతలపట్టు గ్రంథాలయ వార్షికోత్స వం బుధవారం ఘనంగా నిర్వహించారు. బాలల దినోత్స వం పురస్కరించుకుని పూతలపట్టు సర్పంచ్ మాసాల మణి మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాసాల మణి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులు అని విద్యార్థులు గ్రంథాలయాల్లోని ప్రతి పుస్తకంను చదివి విజ్ఞానంను ఆర్జించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు మోహన్, కృష్ణమూర్తిలు మాట్లాడుతూ విద్యార్థుల్లో వున్నటువుంటి మేధోశక్తిని పెంపొందించడం గ్రంథాలయాల్లోని పుస్తకాలకే సాధ్యం అవుతుందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు. ప్రస్తుత పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో వున్నాయని వీటిని చదివి ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్పంచ్ మాసాల మణి బహుమతులు అందజేశారు.



## విద్యార్థుల బాల్యం చాలా విలువైనది

కల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త

విద్యార్థులు నవభారత నిర్మాతలుగా ఎదగాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రీ వాణి పేర్కొన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లూరులో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి తెలిపారు.

## వృద్ధురాలిపై దాడి



పుంగనూరు రూరల్,నవంబరు 14 ప్రభాతవార్త :

పట్టణంలోని మేలుపట్లప్రాంతానికి చెందిన వృద్ధమహిళ పార్వతమ్మపై అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు దాడికి పాల్పడి గాయపరచడంతో ఆమె తీవ్రగాయాలతో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మేలుపట్లకు చెందిన పార్వతమ్మకు అదేప్రాంతానికి చెందిన వాహబ్, షాహీనా,నూర్జహాన్ అనే మహిళలతో ఇంటివద్ద సమస్యలతో గొడవ మొదలైంది. ఈ నేపథ్యంలో ముగ్గురు మహిళలు ఆమెపై దాడిచేయడంతో నడుంవిరిగిన పార్వతమ్మ ఆసుపత్రిపాలైంది.

## విద్యార్థులకు సకాలంలో సర్టిఫికేట్లు ఇవ్వండి



**పుంగనూరు రూరల్,నవంబరు 14 ప్రభాతవార్త :** అపార్ విధానం దేశవ్యాప్తంగా సాగుతున్న తరుణంలో విద్యార్థుల నమోదులో భాగంగా తమపూర్తిపేరు, పుట్టిన తేదీలు వంటి వివరాల కోసం సచివాల యాల లో దరఖాస్తుచేసుకున్న విద్యార్థులకు సకాలంలో ధృవీకరణలు అందించాలని ఛైర్మన్ అలీంబాషా ఆదేశించారు. గురవారం కొత్తపేట సచివాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

## బాలలే భావిభారత నిర్మాతలు.



పెద్దపంజాణి నవంబరు 14 ప్రభాతవార్త : నేటిబాలలే భావిభారత నిర్మాతలని హెచ్ఎంలు బాబురెడ్డి,హరిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం తులసమ్మగుడి యుపిస్కూల్,నాగిరెడ్డిపల్లి యూపి స్కూల్లలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగాచదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రదానోపాధ్యయులు సూచించారు .కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప,మాధవన్, రాజేష్‌బాబు, వినా యక, విద్యా ర్థులు పాల్గొన్నారు.

## నేడు కుప్పంలో ప్రజారవాణా సదస్సు



**కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త** కుప్పం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం పది గంటలకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజారవాణా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తెలిపారు. కుప్పం డిపోలోని బస్సులు, రవాణా సౌకర్యం, ప్రయాణీకుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఈసదస్సును ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. కుప్పం ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## 13కుటుంబాలకు కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు : తహశీల్దార్



**కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త** గత కొంతకాలంగా తగిన అర్హతలు ఉండి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న 13 కుటుంబాలకు ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు మంజూరుచేసినట్లు తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు లబ్దిదారులకు కొత్త రేషన్‌కార్డుల ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొత్తగా మంజూరైన కార్డుదారులు ఈ నెల నుంచే చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులు పొందవచ్చున్నారు. ప్రభుత్వం త్వరలోనే అర్హులు అందరికీ నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్త కార్డులను పంపిణీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు.విఆర్వో రవినాయక్ పాల్గొన్నారు

## సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి : గౌనివారి



**శాంతిపురం, నవంబర్ 14 ప్రభాతవార్త** మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. గురువారం ఆయన కొలమడుగు, దండికుప్పం, ఎంకెపురం, కెపిమిట్ట, సంతూరు గ్రామాల్లో పర్యటించి సభ్యత్వ నమోదుపై కార్యకర్తలు, గ్రామస్తులతో చర్చించారు. మండలాన్ని సభ్యత్వ నమోదులో ఆదర్శంగా నిలపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థులు దేశ భవిష్యత్తు నిర్దేశకులు

కుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త



విద్యార్థులు దేశ భవిష్యత్తు నిర్దేశకులు అని స్థానిక మోడల్ కాలనీ సాయిబాబా స్కూల్ కరస్పాండెంట్ జివి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం బాలల దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివంగత ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూజలు చేశారు. వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు.ఉపాధ్యాయులు యాస్మిన్, రజియా, నవ్య, అఖిల, విద్యార్థులు పాల్గొన్నారు.

## 108 ఉద్యోగుల సమ్మె నోటీసు

రామకుప్పం, నవంబర్ 14 ప్రభాతవార్త



తమ సమస్యలను ప్రభుత్వ ం, అరబిందో సంస్థ తీర్చకుంటే సమె ్మ బాట పడుతామని 108 ఉద్యోగులు గురువారం సమ్మె నోటీసును అధికారులకు అందించారు. 108 చిత్తూరు జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, మెడికల్ టెకీ ్నషియన్ లక్ష ్మనాయక్, పైలట్ సురేష్ ఈసందర్భంగా మాట్లాడుతూ 108ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. వేతనాలు పెంచాలని, 12గంటల పనివిధాన ం రద్దు చేసి 8గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. చనిపోయిన ఉద్యోగులకు ఇరవై లక్షల భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మాదిగల ఆరాధ్య దైవంగా మంద కృష్ణ

చౌడేపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త



మాదిగల ఆరాధ్య దైవంగా మందకృష్ణ చరిత్రలో నిలచిపోతాడని ఎమ్మార్పీఎస్ నాయకులన్నారు. మదనపల్లి మాదిగల ఆత్మీయ సమ్మేళనకు మండలం నుంచి అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్ళారు. ఈ మేరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించి మదనపల్లికి తరలి వెళ్ళారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బాజిగం హరిబాబు, నాయకులు ఆంజప్ప, గోవిందు, ఎం.హరిబాబు, లోకేష్, బి.చిట్టిబాబు, రెడ్డెప్ప, నాగరాజ, తదితరులు వెళ్ళిన వారిలో వున్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం



చౌడేపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు బాలలదినోత్సవాన్ని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైయివేటు పాఠశాలల్లో ఆయన చిత్రపటాన్ని వుంచి నివాళులర్పించారు. స్థానిక ఉన్నతపాఠశాలలో విద్యార్థులందరికీ పిళ్ళారీ ఏజెన్సీస్ అధినేత పిళ్ళారి జీవన్‌ప్రకాష్ స్వీట్లు పంచిపెట్టారు. విజయవాణిఇంగ్లీష్‌మీడియంస్కూల్‌లోబాలలదినోత్సవాన్నిపురస్కరించుకొనిపలు నిర్వహించారు.

## దాతృత్వం చాటిన దర్శితశ్రీని సన్మానించిన భానోదయ యాజమాన్యం

గంగాధర నెల్లూరు నవంబరు 14 ప్రభాతవార్త:



మండలంలోని శ్రీ భానోదయ విద్యాసంస్థలు తొమ్మిదవ తరగతి చదువుతున్న కలిగిరి వెంకటాపురానికి చెందిన ఢిల్లీ నాయుడు కుమార్తె దర్శితశ్రీని గురువారం భానోదయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్‌రావు మెమెంటోతో సత్కరించారు. తుఫాను సహాయ నిధికి పాఠశాల తరపున రూ.12,860లు వసూలు చేసి తన దాతృత్వాన్ని చాటి మొదటి స్థానంలో నిలిచిందని, ఈ సందర్భంగా విద్యార్థినిని, వాళ్ల కుటుంబ సభ్యులను దుశ్శాలువ, మెమెంటోలతో సత్కరించారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, నవంబర్ 14 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం లో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరు జిల్లా తిమ్మస ముద్రంకు చెందిన తులసీకృష్ణ అనే భక్తులు నిత్యాన్న దానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్‌కు అందజేశారు.

## తవణంపల్లెలో ఘనంగా బాలల దినోత్సవం

తవణంపల్లె, నవంబర్ 14 ప్రభాతవార్త:



మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బాలల దినోత్సవం మండల విద్యాశాఖ అధ్వర్యంలో నిర్వహించారు. ఈమేరకు చాచా నెహ్రూ చిత్రపటాన్ని వుంచి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు.ఎంఈఓత్యాగరాజులురెడ్డి,పాఠశాలఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ డిఎంకు 8 ఫిర్యాదులు



పలమనేరు,నవంబర్ 14,ప్రభాతవార్త:

పలమనేరు ఆర్టీసి డిఎంకు డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో 8 ఫిర్యాదులు అందినట్లు పలమనేరు ఆర్టీసి డిపో డిఎం స్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి 8 ఫిర్యాదులు వచ్చాయని ప్రధానంగా చిత్తూరు నుండి రాత్రి 9గంటల తరువాత పల్లె వెలుగు బస్సులు లేవని, తిరుపతికి అదనంగా బస్సుసర్వీసు ఏర్పాటు చేయాలని, దాసార్లపల్లెతోపాటు పలు ప్రాంతాల నుండి పలమనేరుకు బస్సు సర్వీసులు తక్కువగా ఉన్నాయని, శ్రీశైలం తదితర పున్యక్షేత్రాలకు బస్సు సర్వీసులకు ఏర్పాటు చేయాలని కోరారన్నారు.దీనిపై నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## పోసానిపై పోలీసులకు ఫిర్యాదు

పలమనేరు,నవంబర్ 14,ప్రభాతవార్త:



సినీనటుడు,రచయిత పోసాని కృష్ణమురళిపై సీనియర్ విలేకరి గురువారం పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఇ టీవల తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్.నాయుడుపై పోసాని సామాజికమాధ్యమాలలో అసభ్య వ్యాఖ్యలు చేయడం జరిగిందని, ఆయనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పలమనేరుకు చెందిన సీనియర్ విలేకరి లగడపాటి శరత్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ నరసింహరాజుకు ఫిర్యాదు చేశారు.

## బాధితులందరికీ న్యాయం చేస్తాం

**సోమల, నవంబర్ 14, (ప్రభాతవార్త)** ఆవులపల్లి ప్రాజెక్టు వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. గురువారం ఆమె ప్రాజెక్టు ముంపు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు వల్ల ఎంతమంది రైతులు నష్టపోయారో తాసిల్దార్ బెన్ను రాజును అడిగి తెలుసుకున్నారు. అటవీ రెవెన్యూ భూములను గుర్తించి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ప్రాజెక్టు ముంపు బాధితులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి ప్రదానం



**రొంపిచర్ల, నవంబర్ 14, ప్రభాతవార్త:** రొంపిచర్ల మండలం బొమ్మయ్యగారి పల్లి గ్రామపంచాయతీ నగిరి దళితవాడల ప్రాథమిక పాఠశాలలో బాలాలదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పూర్వ విద్యార్థులు విద్యాసామాగ్రి ప్రదానం చేశారు. పూర్వ విద్యార్థులు పెన్నులు పెన్సిల్ నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నియోజకవర్గాన్ని చక్కదిద్దండి - మాజీ ఎమ్మెల్యే



**సత్యవేడు, నవంబరు 14 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గంలో ఏర్పడిన సంక్షోభం వలన గాడి తప్పిన పరిపాలనతో దిక్కుతోచని స్థితిలో తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన నాయకులు ఎవరికి వారే యమునా తీరే అనే ధోరణిలో నాయకులు ఉండడంతో నియోజకవర్గంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మాజీ ఎమ్మెల్యే హేమలత గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే సత్యవేడు నియోజకవర్గ పరిస్థితులు చక్కబెట్టే విధంగా చర్యలు ఉంటాయని పార్టీ క్యాడర్‌కి భరోసాపై చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత తెలిపారు.

## వేదాంతపురం సచివాలయాన్ని ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీ



**తిరుపతిరూరల్,నవంబర్14 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ వేదాంతపురం గ్రామ పంచాయతీ సచివాలయాన్ని గురువారం ఎంపిడిఓ రామచంద్ర ఆకస్మిక తనిఖీ చేసారు. సచివాలయ సిబ్బంది హాజరుపట్టిక, పంచాయతీ సిబ్బంది రిజిస్ట్రర్, పింఛన్ లబ్దిదారుల రిజిస్టర్స్‌ను పరిశీలించారు. ఉదయం 11గంటలైన ఎందుకు పంచాయతీ సిబ్బంది రాలేదని ప్రశ్నించారు. పంచాయతీ సిబ్బంది జీత భత్యాలు, పంచాయతీ ఆధాయ, వ్యయాలపై ఆరా తీసారు. పంచాయతీ సిబ్బంది జియోట్యాగింగ్ నమోదు చేయడానికి వెళ్ళారని పంచాయతీ కార్యధర్శి మునీశ్వరి తెలిపారు.

## తడుకు రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ

పుత్తూరురూరల్, నవంబరు 14 ప్రభాతవార్త:

పుత్తూరు మండలంలోని తడుకు గ్రామపంచాయతీలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశామని తడుకు సర్పంచ్ వెంకటేష్ తెలిపారు. గురువారం తడుకులోని స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద స్థానిక నేతలతో కలసిరైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆది మండడి, టీడీపీనాయకులు అమర్‌నాథ్ రాజు, భాస్కర్‌శెట్టి, విలేజ్ అగ్రికల్చర్ అధికారి తరుణ్, పంచాయతీ సెక్రటరీ నరేష్, రైతులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి - సీపీఎం ధర్నా



**పుత్తూరురూరల్, నవంబరు 14 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ఈ నెల 8 నుంచి 14 తేదీ వరకు అన్ని వార్డుల్లో, గ్రామాల్లో కరపత్రాలు పంపిణీచేసి ప్రజా సమస్యలపైన గురువారం పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, అదే విధంగా నిత్యావసర దారులు తగ్గించాలని, విద్యుత్ ట్రూ ఆఫ్‌చార్జీలు రద్దు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, మహిళలపై, పిల్లలపై దాడులను అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఉచిత ఇసుక పేరుకే తప్ప గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వం ఎక్కువ రేట్లు పెట్టిందన్నారు. దీని వల్ల భవన నిర్మాణ కార్మికులకు వీధున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, నాయకులు మునిశంకర్, నరసింహులు, గోవిందరెడ్డి, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నియమించిన ప్రొఫెసర్‌ను తొలగించాలి

**తిరుపతి విద్య,నవంబర్ 14,ప్రభాతవార్త:** ఎస్వీయూలో నిబంధనలకు విరుద్ధంగా నియమించిన ప్రొఫెసర్ కేటీ రామకృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని విద్యార్థి సంఘాలు డిమాండు చేశారు.ఈ మేరకు బుధవారం వీసీ సీహెచ్ అప్పారావును కలసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వైఎస్సా ఆర్సీపీ,ఎన్ఎస్ఈయూఐ,బీడీవీఎస్, ఏపీవీహెచ్ఎస్,డీబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ వర్సిటీ అవినీతి పాలనకు అడ్డాగా మారిందని, వర్సిటీలోని అధికారులు చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడటం దారుణమన్నారు.ఆయనను 1997లో విడుదలైన నోటిఫికేషన్లో తాత్కాలిక అధ్యాపకునిగా నియమించడం జరిగిందన్నారు.రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా అప్పటిలో విధులలో చేరారని,ఆయన పోస్టుకు ఆర్థిక శాఖ ఆమోదం ఇప్పటికీ తెలపలేదన్నారు. తాత్కాలిక పోస్టులో కొనసాగుతూ అధికారులను మాయ చేసి విభాగాధిపతిగాను, వార్డన్,వైస్ ప్రిన్సిపల్, డీన్,మరికొన్ని విభాగాలకు హెడ్గాను కొనసాగడం నిబంధలకు విరుద్ధం కాదాని ప్రశ్నించారు. వెంటనే ప్రొఫెసర్ కేటీ రామకృష్ణారెడ్డిని వెంటనే విధుల నుంచి తొలగించి న్యాయవిచారణ చేపట్టాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

రేణిగుంట, నవంబరు 14 ప్రభాతవార్త:

రేణిగుంట గ్రంథాలయంలో బాలల దినోత్సవం పురస్కరించుకుని గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మండల పరిషత్ పాఠశాల హెడ్మాస్టర్ అరుణమ్మ పాల్గొని చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారి శ్రీముఖి చాచా నెహ్రూ జీవిత చరిత్రను వివరించారు. నవంబరు 14 నుంచి 20 తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా గ్రంథాలయ పాఠకులకు విద్యార్థులకు వివిధ రకాల వ్యాసరచన, వక్తృత్వ, ఆటలు, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజు బహుమతులు అందజేస్తామన్నారు.

## నేటి బాలలే రేపటి పౌరులు - జయలక్ష్మి



**రేణిగుంట, నవంబరు 14 ప్రభాతవార్త:** బాలల దినోత్సవం పురస్కరించుకుని రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ప్లస్‌టు ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ, రాస్ బాలాజీ బాల వికాస్ సంయుక్తంగా అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి జయలక్ష్మి జిల్లా బాలల సంరక్షణ అధికారి శివశంకర్, పాఠశాల ప్రధానాచార్యులు విష్ణువర్ధని, ప్రగతి సంస్థ వ్యవస్థాపకులు రమణ, రాస్ బాలాజీ బాల వికాస్ ప్రాజెక్టు అధికారి రమేష్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ బాలలపైనే రేపటి భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. బాలల హక్కులను హరించడం క్షమించరాని నేరమన్నారు. విద్య బాలలకు ప్రాథమిక హక్కు అని బాలలను చదివించకుండా పనులకు పంపితే జైలు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రాస్, ప్రగతి స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గులాబీలు మామయ్య చాచా నెహ్రూ - ఆషారాజు

రేణిగుంట, నవంబరు 14 ప్రభాతవార్త:



స్వాతంత్ర్య భారతావని తొలి ప్రధాని చాచా నెహ్రూ పుట్టిన రోజును జాతీయ బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు అన్నారు. రేణిగుంట మండలం అన్నసంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పాఠశాలల అధ్యాపక బృందం విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వకృత్వ ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత గౌడ్, ఉపాధ్యాయులు, ఆశ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం

విజయపురం, నవంబరు 14 ప్రభాతవార్త:

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్రీడలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఎల్లసముద్రం ప్రాథమిక పాఠశాల పిల్లలకు రిటైర్డ్ ఉపాధ్యాయులు చంద్రయ్య విద్యా సామగ్రినిఉపాధ్యాయులు వంశీకృష్ణ చేతుల మీదుగా విరతణ చేశారు. శ్రీహరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలు తెలిపిన పారిశుద్ధ్య కార్మికులు



**తిరుపతి హెల్త్, నవంబర్ 14, ప్రభాతవార్త** ఏపి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రసూతి ఆసుపత్రి నందు జిల్లా కలెక్టర్‌ను శానిటేషన్ వర్కర్స్ కలిసి వారి సమస్యలను తెలిపారు. నాలుగు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, మూడు సంవత్సరాలు పిఎఫ్, ఈఎస్ఐ ఇవ్వాలని కలెక్టర్‌కి తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుట్టా మహేంద్ర, కార్మికులు వనజ, నాగజ్యోతి, మునిరాజమ్మ, గుర్రమ్మ, పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉన్నత స్థానం సాధించడమే లక్ష్యంతో పనిచేయండి



**తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 14, ప్రభాతవార్త** కంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో తిరుపతి ఉన్నత స్థానం సాధించడమే లక్ష్యంతో అందరూ పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల పై నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో గురువారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో తిరుపతి నగరం దేశంలోనే ఉన్నతమైన స్థానాల్లో నిలిచిందని అన్నారు. ఈ సంవత్సరం నిర్వహించే పోటీల్లో కూడా ఉత్తమ స్థానం సాధించేలా అందరు కృషి చేయాలి అన్నారు. ముఖ్యంగా వాటర్ ప్లస్ పోటీలలో, చెత్త రహిత నగరాల్లో ఇచ్చే సెవెన్ స్టార్ రేటింగ్ లోను ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. నగరంలో వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, నగరంలో ఎక్కడ చెత్త కుప్పలు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు, టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు

## 9 అంశాలపై ఎస్వీయూ పాలకమండలి ఆమోద ముద్ర



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వర వర్సిటీలోని ఉపకులపతి కార్యాలయంలో పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షులుగా ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు వ్యవహరించారు. ప్రధాన నిర్ణయాలు యస్వీయూ లోని మైక్రో బయాలజీ బిల్డింగ్ నిర్మాణానికి 1.02 కోట్లు నిధులకు ఏకగ్రీవ ఆమోద లభించిం ది .యస్వీయూలోని ఫార్మాసి బిల్డింగ్ నిర్మాణానికి 2.8 కోట్ల రూపాయలకు పాలకమండలి ఆమోదం లభించింది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలాక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడానికి పాలకమండల ఆమోదు లభించింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుభందంగా ఉన్న క్యాంపస్ స్కూల్లో విద్యార్థులు టాయిలెట్స్ కోసం 76.80 లక్షల నిధులు ఇవ్వడానికి పాలకమండలి ఆమోదం లభించింది. యస్వాయూ అడ్మినేస్ట్రేటివ్ బిల్డింగ్ లోని నాలుగు అంతస్తుల టాయిలెట్ల కోసం 85 లక్షల రూపాయలు మంజూరుకు పాలకమండలి ఆమోదం. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలంలోని ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ప్రమోషన్ల కొరకు పాలకమండలి ఆమోదం ఇచ్చింది. సమావేశానికి ఉన్నత విద్యామండలి ఇంచార్జ్ ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్ రావు. యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం భూపతి నాయుడు పాలకమండలి సభ్యులైన ఆచార్య సుగుణమ్మ, ఆచార్య పద్మనాభం. ఆచార్య కోల మంజుల డాక్టర్ మొహిద్దిన్ బాష, నారాయణ బాబు హాజరయ్యారు. ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, ఆచార్య సుమికిరణ్, ప్రభుత్వ ఆర్థిక శాఖ విభాగం నుండి డిప్యూటీ సెక్రటరీ ఆదినారాయణ ఆన్లైన్లో హాజరయ్యారు.

## డిప్యూటీ స్పీకర్‌ను అభినందించిన ఎమ్మెల్యే



**పుత్తూరు, నవంబరు 14 ప్రభాతవార్త :** శాసనసభలో డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజును నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ గురువారం అభినందించారు. డిప్యూటీ స్పీకర్‌గా రామకృష్ణంరాజు ఎంపిక వ్యక్తిగతంగా తనకు ఎంతో సంతోషం కలిగించిందని పేర్కొన్నారు.

## శేషసాయి స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం



**పుత్తూరు, నవంబరు 14 ప్రభాతవార్త :** స్థానిక శేషసాయి పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌బాబు మాట్లాడుతూ దివంగత భారతదేశ ప్రధానమంత్రి జవహర్‌లాల్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం నెహ్రూ జీవిత చరిత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. వక్తృత్వ పోటీలు పెట్టి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ కరస్పాండెంట్ ఎం.ఎన్.ఇంద్రజిత్, ఎఐ కె.భానుమూర్తి, డైరక్టర్లు కె.రమేష్, డి.జయప్రకాశ్ (చిట్టి) తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకదీపోత్సవాలకు ఆధ్యాత్మిక శోభ

**తిరుమల, నవంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీకమాసంలో సోమవారం 18వతేదీ



సాయంత్రం కార్తీకదీపాలు వెలిగించే టిటిడి పరిపాలన భవనం ప్రాంగణం భక్తిభావం ఉట్టిపడాలని టిటిడి జెఈఓ వీరబ్రహ్మం తెలిపారు. ఇందుకోసం ప్రాంగణంలో మహిళలు కూర్చుని దీపాలు వెలిగించేలా దీపవు దిమ్మెలు, నేతి వత్తులు ఏర్పాటుచేస్తున్నారు. మైదానం మొత్తం తివాచీలు, ఒక్కో దీపపు దిమ్మెవద్ద తులసిమొక్కను ఉంచుతారు. కార్యక్రమం అనంతరం తులసిమొక్కను మహిళలకు అందిస్తారు. పచ్చని అరటిచెట్లు, మామిడితోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. ఏర్పాట్లపై టిటిడి సీనియర్ అధికారులతో జెఈఓ సమీక్షించారు. మహిళా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేయాలన్నారు.

## పంచవర్షప్రణాళికలు అమలుచేసిన నెహ్రూ



**తిరుపతి(రవాణా), నవంబర్ 14ప్రభాతవార్త:** దేశ ఆర్థిక అభివృద్ధికి పంచవర్ష ప్రణాళికలు ఎంతగానో దోహదంచేశాయని, దీన్ని ముందుచూపుతోనే అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ అమలుచేశారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. నెహ్రూ జయంతి పురస్కరించుకుని గురువారం ఉదయం నెహ్రూ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. తిరుపతి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల గురవంబాబు, డిసిసి ప్రధాన కార్యదర్శి లోకేశ్‌రెడ్డి ,తిరుపతి నగర పార్టీ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు, కాంగ్రెస్ నేతలు రాంభూపాల్‌రెడ్డి, మాంగాటి చంద్రశేఖరరెడ్డి, వెంకట నరసింహులు, మురళీకృష్ణ, సుప్రజ, చిత్తూరు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగులమందు తాగి యువకుడు మృతి



**తొట్టంబేడు, నవంబర్ 14 ప్రభాతవార్త** మండలంలోని నెల్లిమానుకండ్రిగ గ్రామానికి చెందిన శివయ్య కుమారుడు నాగులు(17) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్‌పూర్తిచేసి ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. అయితే ఇంటర్‌లో ఉత్తీర్ణుడు కాకపోవడంతో పట్టణంలోని దుకాణంలో పనిచేస్తు జీవనం నడుపుకొస్తున్నాడు. అయితే రెండు రోజుల క్రితం తండ్రి శివయ్య పనికి వెళ్ళవద్దని చక్కగా చదువుకోవాలని మందలించగా నాగులు పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన పట్టణంలోని ఓప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించి మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. దీంతో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

## చిగురువాడ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు మెరుగు



**తిరుపతిరూరల్, నవంబర్14 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు మెరుగు పరచాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. గురువారం చిగురువాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను సర్పంచ్ ముచ్చెలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ గ్రామసభలో పంచాయతీ పధిలోని కొత్తూరులో చెత్త సంపద కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణంలో చెట్ల పెంపకానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. తిరుపతి 150 బైపాస్ రోడ్డు నుండి రాయలచెఱువుకు వెళ్ళే మార్గ మధ్యలో చిగురువాడ పంచాయతీ పరిధిలో ప్రధాన రోడ్డు పక్కనే చెత్తను ధంప్ చేస్తున్నారని, చెత్త ధంప్‌ను అరికట్టడానికి చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.

## నేటి నుండి కార్తీక పౌర్ణమి పూజలు

**పాకాల, నవంబర్ 14, ప్రభాతవార్త** పాకాల మండలంలోని ఉప్పరపల్లి గ్రామపంచాయతీ సూరినేని వారి పల్లెలోని గుర్రప్ప స్వామి ఆలయం నందు నేటి నుండి మూడు రోజులపాటు కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బుజ్జి బాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రప్ప స్వామి ఆలయం నందు విశ్వశాంతి కై ప్రతి యేటా నిర్వహిస్తున్న 16వ సంవత్సర పూజ కార్యక్రమాలు గురువారం సాయంత్రం కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయన్నారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, అనంతరం రుద్రాభిషేకం , బిల్వార్చన , శ్రీ శ్రీ శ్రీ లలితా పరమేశ్వరి దేవి లక్ష కుంకుమార్చన, అన్నాభిషేకం సాయంత్రం జ్యోతిర్లింగ సహస్ర దీపాలంకరణ తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**.తొట్టంబేడు, నవంబర్ 14 ప్రభాతవార్త** పట్టణంలోని స్థానిక ధర్మరాజులగుడి సమీపంలో తొట్టంబేడు పరిధిలో ఉన్న శ్రీచైతన్య-3 బాలల దినోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ నిరోషా సారధ్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందస్తుగా చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులు వివిధ వేషధారణలతో వచ్చి నృత్య ప్రదర్శనలు చేయడంతో పాటు వారికి చిత్రలేఖన, పాటల పోటీలను నిర్వహించారు. అనంతరం చిన్నారులకు మెడల్స్ సర్టిఫికెట్లు అందించారు. అనంతరం ప్రిన్సిపల్ నిరోషా చాచానెహ్రూ గురించి చిన్నారులకు వివరించారు. చిన్నారులంటే నెహ్రూకు ఎంతో ఇష్టం కనుక అందరు ఆయన్ను చాచా నెహ్రూ అని పిలుస్తారు. ఆయన దుస్తులపై ఎప్పుడు రోజాపువ్వు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీన్ సురేంద్ర, ఇన్‌ఛార్జి రమేష్, షిఫ్టీ శంకర్ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంధాలయ వారోత్సవాలు ప్రారంభం



**తొట్టంబేడు, నవంబర్ 14 ప్రభాతవార్త** 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలను చేసి ఆయనకు నివాళులు అర్పించారు. గ్రంధాలయాధికారి ఏ.హరికృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు చాక్‌లెట్లు, బిస్కట్లు పంపిణీచేశారు. గ్రంధాలయాలు ఉపయోగించుకుని సభ్యత్వ తీసుకుని ఉత్తమ నేస్తాలైన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్ళి చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠకులు, స్థానికులు హాజరయ్యారు.

## పాఠశాలకు కలర్‌ప్రింటర్ వితరణ



**తొట్టంబేడు, నవంబర్ 14 ప్రభాతవార్త** మండలంలోని జిల్లాపరిషత్ గుండేలిగుంట పాఠశాలకు శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు మునితిరుమలయ్య ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డీస్ వెల్ఫేర్‌అసోసియేషన్ దాతృత్వంతో పాఠశాల విద్యార్థులకు రూ.18వేలు విలువ చేసే కలర్ ప్రింటర్‌ను వితరణగా అందించారు. ఈసందర్భగా శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చెంచురెడ్డి మాట్లాడుతూ నెహ్రూని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు బి.చెంచయ్య మాట్లాడుతూ బాలల దినోత్సవ విశిష్టతను గురించి వివరించారు. గణిత ఉపాధ్యాయులు మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘాన్ని అభినందించారు. కార్యక్రమంలో రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చెంచురెడ్డి, ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, భాస్కరయ్య, జయసింహ, చెంచయ్య, శ్రీకర్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి పాఠశాల కమిటీ సత్కారం



**.తొట్టంబేడు, నవంబర్ 14 ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్‌చే ఉత్తమ ఉపాధ్యాయునిగా ప్రశంసలు అందుకున్న దిగువసాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ కయ్యూరు బాలసుబ్రమణ్యంను బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యాకమిటీ గురువారం ఘనంగా సత్కరించారు. విద్యాకమిటీ ఛైర్మన్ కల్పన మాట్లాడుతూ పాఠశాలలో చేరిన అతి తక్కువ కాలంలోనే ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం మంచిపేరుకు తీసుకువచ్చారని భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు నిర్మల, మాజీ ఛైర్మన్ దేవిక, సభ్యులు సుధాకర్, మాధవి, మోహనరాణి, విద్యార్థులుపాల్గొన్నారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## నేటి బాలలే రేపటి పౌరులు



**శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త** నేటి బాలలేరేపటి పౌరులని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ఎస్.బత్తెయ్యనాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో చాచానెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ సహాయని రాకం˘ణ ఉద్యమం, సైమన్ కమిషన్ బహిష్కరణ, ఉప్పుసత్యాగ్రహం, గాంధీ ఇర్విన్ ఒప్పందం, క్రిప్స్ రాయబారం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. బాలలంటే ఇష్టం కాబట్టి ఆయన్ను చాచానెహ్రూ అని పిలుచుకుంటారన్నారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో నాయకులు గోపి, వీరరాఘవరెడ్డి, రమణయ్య, శివయ్య, నందకిషోర్, నాగూరయ్య పాల్గొన్నారు.

## బాలలు దేశభవిష్యత్తుకు పునాదులు

**శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త**



బాలలు దేశభవిష్యత్తుకు పునాదులని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని భాస్కరపేటలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్‌జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాలల చట్టాల గురించి తెలుసుకోవాలని, బయటకు వెళ్ళేటపుడు చుట్టుపక్కల పరిస్థితులను గమనిస్తుండాలన్నారు. న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థల ఆక్రమ దారునిపై చర్యలు తీసుకోండి

**తిరుపతి హెల్త్, నవంబర్ 14, ప్రభాతవార్త**



పేరూరు గ్రామం లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 197/1 పాతకాల్వ వద్దనున్న తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితురాలు పద్మజ విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన భర్త ఎక్స్ రిటైర్మెంట్ ఆర్మీ అని అతనికి వచ్చిన డబ్బుతో 2018 సంవత్సరంలో సర్వేనెంబర్‌లో 63 సెంట్లు భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన ఆస్తిపత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. అయితే పాతకాల్వకు చెందిన డి కల్పన అనే ఆమె తమ స్థలాన్ని ఆక్రమించుకుని ప్రహరీ ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. తమ భూమితో పాటు మరో 14 మందికి చెందిన భూమిని కూడా ఆమె ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీనిపై తాము ప్రశ్నిస్తే తమపైకి దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. తాము పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని వాపోయారు. ఈ విలేకరుల సమావేశంలో పద్మజ తమ్ముడు ప్రకాష్, బాధితులు హేమంత్ ఆచారి, రాజేశ్వరి, గురుమూర్తి, మహేష్, వెంకట్ రెడ్డి, లక్ష్మీ ,అనిత పాల్గొన్నారు.

## నేడు సామూహిక కార్తీక దీపోత్సవం

**తిరుపతి హెల్త్, నవంబర్ 14, ప్రభాతవార్త**



కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఇసో ధ్యాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఐదు నుండి 9 గంటల వరకు ఇంద్ర మైదానంలో సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుజనా, హేమంత్ తెలిపారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడారు. పరమశివునికి అత్యంత పవిత్రమైన కార్తీక మాసం ,లో శివునికి దీపారాధన చేసి పూజలు అందిస్తే పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. ఈ మేరకు తాము నిర్వహించే కార్తీక దీపోత్సవంలో భాగంగా ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక ప్రవచనాలు, కోలాటం, కేరళ వైద్య వంటి వాటిని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. దీపోత్సవానికి విచ్చేసే భక్తులకు అక్కడే దీపాలతో పాటు పూజా సామాగ్రి అందజేయడం జరుగుతుందన్నారు. ఉచితంగా చేపట్టే సామూహిక కార్తీక దీపోత్సవంలో భక్తులందరూ భాగ్యస్వాములై పరమశివుని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నిర్వాకులు రవి, కామెడీ శాస్త్రి, శివయ్య పాల్గొన్నారు.

## 25 నుండి సమస్యల పరిష్కారం కై సమ్మె

**తిరుపతి హెల్త్, నవంబర్ 14, ప్రభాతవార్త**



ఏపీ 108 సర్వీసులలో విధులు నిర్వహిస్తున్న ఇఎంటి, పైలెట్ ఉద్యోగుల సుదీర్ఘకాల అపరిష్కృత సమస్యల పరిష్కార సాధనకై తప్పనిసరి పరిస్థితులలో ఈ నెల 25 నుండి సమ్మెకు వెళ్తున్నామని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కిరణ్ కుమార్, మహేష్, కన్నెప్పగారి కేశవులు, సునీల్, శ్రీదేవి, మునిరాజా, ఊహ, మాధవ్, సుధాకర్, బాల ఓబులయ్యాలు వెల్లడించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియాతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడువేలకు పైగా 108 అంబులెన్సు ఉన్నాయని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు తదితర సందర్భాలలో ప్రాణాలు కోల్పోతున్న వారిని తాము కాపాడుతున్నాం అన్నారు. అలాంటి తమ కుటుంబాల్లో ఆర్థికంగా పడుతున్న కష్టాలకు పరిష్కారం కోసమే తాము ఈ సమ్మెకు దిగుతున్నామని స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ కింద పని చేస్తున్న తమను ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

## అధినేత కేజ్రీవాల్‌కు ఆఫ్ నేతలు సన్మానం

**తిరుపతి, నవంబర్ 14ప్రభాతవార్త:** "ఆఫ్"కన్వీనర్, ఢిల్లీ మాజీముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దంపతులు శ్రీవారి దర్శనానంతరం గురువారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. ఇక్కడ తిరుపతి జిల్లా ఆప్ పార్టీ నేతలు కలసి ఘనంగా సన్మానించారు. రాష్ట్రపార్టీ ఇన్‌ఛార్జి మణినాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కుమార్, నేతలు కాటవరప్రసాద్, బాలసుబ్రమణ్యం, జిల్లా కన్వీనర్ నీరుగట్టునగేశ్ తదితరులు కలిసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.

# తిరుపతి డివిజన్

## రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు : ధనంజయయాదవ్



**విజయపురం, నవంబరు 14 ప్రభాతవార్త:** చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉంటేనే రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు సకాలంలో అందుతుందని జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన విజయపురంలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళలో రైతులు సబ్సిడీ వేరుశనగ కోసం ఎదురు చూసి నిరాశ చెందారని విమర్శించారు. అనంతరం మండలంలోని పన్నూరు హరిశ్చంద్రాపురంలో మండల టీడీపీ నాయకులు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో రజనికుమారి, సిబ్బంది, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా భాష్యం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు



**తిరుపతి విద్య నవంబర్ 14 ప్రభాత వార్త:** స్థానిక వరదరాజ నగర్ శ్రీపురం కాలనీలో ఉన్న భాష్యం పాఠశాలలో జోనల్ ఇన్చార్జి లక్ష్మణరావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ బాలాజీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అందరూ అనుభవించే బాల్యం భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం అని, నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లలు మానసికంగా దృఢంగా ఉండాలని, ఆటపాటలతో సత్తా చాటాలని, సెల్‌ఫోన్ మాయలో పడి చిన్నతనం నుండే ఆటపాటలకు దూరముగా కావద్దని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో లిటిల్ ఛాన్స్ ఇంచార్జి సుధాకుమారి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 4 నుంచి డిగ్రీ పరీక్షలు

**తిరుపతి విద్య నవంబర్ 14 ప్రభాతవార్త** ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 4వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మూడే దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని కళాశాల యాజమాన్యాలకు పరీక్షల టైమ్ టేబుల్ ను పంపించినట్లు పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యాలు పరీక్షల నిర్ణీత టైమ్ టేబులన్ను అనుసరించాలిని ఆయన కోరారు.

## పాకాల ప్లాటినం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం



**పాకాల, నవంబర్ 14, ప్రభాతవార్త.** పాకాల ప్లాటినం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్‌వీఎన్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు మోహన్ అధ్యక్షతన, ముఖ్య అతిథులుగా మండల విద్యా శాఖ అధికారులు బాబ్జి, లింగయ్య, లైన్ జయరామ నాయుడు సహకారంతో వ్యాసరచన, డ్రాయింగ్, వకృత్వాపు, ఫ్యాన్సీ డ్రెస్ విజే తలకు బహుమతుల బాబ్జి చేతుల మీదుగా ప్రదానం చేసారు. విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జయరామ నాయుడు, తులసీరామ్, కుప్పు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ, రీసెట్ పరీక్షలు వర్సిటీనే నిర్వహించాలి

**తిరుపతి విద్య, నవంబర్ 14 ప్రభాతవార్త** పీజీ, రీసెట్ ప్రవేశ పరీక్షలు ఎస్వీయూ పరిధిలోనే నిర్వహించేలా ఉన్నత విద్యామండలి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షులు జీ శ్రీధర్ డిమాండ్ చేశారు. గురువారం రిజిస్ట్రార్ భూపతినాయుడుని కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మట్లాడుతూ గతంలో పీజీసెట్, రీసెట్ సంబంధించి ప్రవేశ పరీక్షలు వర్సిటీ ఆధ్వర్యంలో జరిగేవని, దీంతో వర్సిటీలోని ప్రతి విభాగంలో పీజీ కోర్సులలో సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యేవన్నారు. కానీ స్టేట్ లెవల్లో ఏపీ పీజీ సెట్ నిర్వహించడంతో వర్సిటీలో కొన్ని పీజీ కోర్సులలో సింగిల్ డిజిట్ అడ్మిషన్లకే పరిమితం కావడం దారుణమన్నారు. వర్సిటీ ఉపాధ్యక్షులు మణికంఠ, ప్రధాన కార్యదర్శి శ్రీను, కార్యదర్శి వెంకటేష్, చంద్ర, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అపార్ ఐడి, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్‌పై కార్యశాల

**తిరుపతి విద్య, నవంబర్ 12, ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వర వర్సిటీ లో రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్, కేంద్ర ఎలక్ట్రానిక్ మరియు సమాచార శాఖ మంత్రిత్వ శాఖ యొక్క డిజిటల్ ఇండియా కార్పొరేషన్ లోని ఎన్ఏడి డిజి లాకర్ సంయుక్తంగా అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్, అపార్ ఐడి సృష్టి నిర్వహణ పై ఒక్క రోజు కార్యశాల నూ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం అకాడమీ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ నందు ప్రతి విద్యార్థికి అపార్ ఐడిని సృష్టించాలని అన్నారు. ఇందులో విద్యార్థుల సాధించిన క్రెడిట్స్, మార్కుల జాబితా, డిగ్రీ పట్టాలు డిజిటల్ రూపంలో విద్య సంస్థలు ద్వారా నిల్వ ఉంచాలన్నారు. కార్యక్రమంలో మరో అతిథి డిజిటల్ ఇండియా జాతీయ కో ఆర్డినేటర్ గౌరవ కరే మాట్లాడుతూ ప్రతి వర్సిటీ దీనిని బాధ్యతగా నిర్వహించాలన్నారు. డిజిటల్ ఇండియా కార్పొరేషన్ జోనల్ కో ఆర్డినేటర్ రవి పాండే మాట్లా డుతూ ప్రతి విద్యార్థి అపార్ ఐడి నీ వారి యొక్క ఆధార్ కార్డు ఉపయోగించి ప్రారంభించాలన్నారు. వర్సిటీ సిడిసి డీన్ ఆచార్య ఎస్ సి రాయుడు, ఆచార్య అఖిల స్వతంత్ర, డాక్టర్ అరుణ జ్యోతి, రాయలసీమ పరిధిలోని వివిధ వర్సిటీల, ప్రధాన కళాశాలల కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్, అడిషనల్ కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్ బాధ్యతలలో ఉన్న అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకతాయిల ఆటకట్టిస్తున్న డివైయస్‌పి



**శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలో కొందరు ఆకతాయిలు ఆగడాలు పట్టణంలో రోజు రోజుకు పెచ్చుపెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన డివైయస్‌పి నరసింహామూర్తి, టౌన్ సిఐ డి.గోపిలు దృష్టి సారించారు. పట్టణంలో శాంతి భద్రతలను పరిరక్షించుటకు ముందడుగు వేసారు. ముఖ్యంగా ఎక్కడైతే ఆకతాయిలు అడ్డగా మార్చుకొని ఆగడాలు సాగిస్తున్నారో ఆ ప్రాంతాలపై దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి సమీపంలోని బిక్షాల గాలిగోపురం సమీపంలోని ఓ మున్సిపల్ కాంప్లెక్సు వద్ద ప్రతి రోజూ గుంపులు గుంపులుగా చేరి మహిళల పట్ల ఆసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు రావటంతో ఆరుగురిని అదుపులో తీసుకున్నారు. వారిని విచారించారు. వారిపై న్యూసెన్సు కేసును నమోదు చేసినట్లు డివైయస్‌పి నరసింహామూర్తి వివరించారు. కాగా పట్టణ శివారుల్లోని డాబాలపై దృష్టి సారించారు. చెన్నై-నాయుడుపేట మార్గంలోని ఓ డాబాపై దాడి చేసి అక్కడ జల్సాలు చేసుకుంటున్న పలువురిని మందలించారు. దాడుల్లో డిఎస్‌పితో పాటు సిఐ గోపి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత గిరిజన అఘాయిత్యాలపై అవగాహన సదస్సు



**శ్రీకాళహస్తి రూరల్, నవంబర్ 14 ప్రభాతవార్త** సమాజంలో నిత్యం దళిత, గిరిజనులపై మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అఘాయిత్యాల నివారణకు సంబంధించి గురువారం శ్రీకాళహస్తి మండలం ఎంపేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అవగాహన సదస్సును నిర్వహించారు. తిరుపతి రీజినల్ సిఐడి డివైయస్‌పి పద్మలత, సిఐ రంగస్వామిల సారధ్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నరసింగప్ప డివైయస్‌పి మాట్లాడుతూ దళిత గిరిజన విద్యార్థులు చదువుకుంటే చట్టాలపై అవగాహన వస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం, ఎస్‌సి ఎస్‌టి చట్టాలపై అవగాహనతెచ్చుకొని చైతన్యవంతుల్ని కావాలన్నారు. డివైయస్‌పి నరసింగప్ప, శ్రీకాళహస్తి రూరల్ ఇన్స్పెక్టర్ రవినాయక్, జిల్లా ట్రైబర్ ఆఫీసర్ సూర్యనారాయణ, ఎంపిడిఓ రఫీఖాన్, ప్రజా ప్రగతి కో ఆర్డినేటర్లుప్రభాకర్, నారాయణ, మాజీ మండల ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాహుకేతు దోషపూజల్లో మాజీ మంత్రి దంపతులు



**శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాష్ట్ర మాజీ భారీ నీటి పారుదలశాఖ మంత్రి దేవినేని ఉమా కుటుంబసభ్యులతో విచ్చేశారు. ఈసందర్భం గా ఆయనకు ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక రా హుకేతుపూజలుచేయించుకున్నారు. అనంతరంఆయనకుస్వామి అమ్మ వార్ల ప్రత్యేకదర్శనం చేసుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయంలోని మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద ఇఓ బాపిరెడ్డి వీరికి స్వామిఅమ్మవార్ల శేషవస్త్రంతో సత్కరించి ముక్కంటిచిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించి వేదపండితుల ఆశీర్వచనాలను అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఆలయ కార్యనిర్వహణాధికారిబాపిరెడ్డి, డిప్యుటీ ఈవో ఎన్ఆర్.కృష్ణారెడ్డి మరియు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## ఈఈఎస్ సంస్థ ద్వారా విద్యుత్ పరికరాలు కొనుగోలు



**శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త** ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో ఊర్జా వీర్ రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో వినియోదారులు http://eeslmart.in./Urjaveer వెబ్‌సైట్‌లో తమకు కావాల్సిన ఫైవ్‌స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ పరికరాలను రిజిస్ట్రేషన్ చేసుకుంటే వాటిని నగదు చెల్లించినట్లయితే కొరియర్‌ద్వారా కానీ, పోస్టాఫీసు ద్వారా కానీ వినియోదారులు ఇంటికి 5స్టార్లు కలిగిన వస్తువులు కొనుగోలు చేయవచ్చని వీటిని అమర్చిన తర్వాత వారికి కమిషన్ కూడా ఇవ్వబడుతుందన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకున్న తర్వాత వస్తువులు ఇంటికి చేరినట్లయితే ఓటిపి వస్తుందని దీని వల్ల విద్యుత్ ఆదా చేయడంతో పాటు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మేరకే స్మార్ట్‌మీటర్లు అమర్చుతున్నామని ముందుగా వ్యాపార, వాణిజ్య సముదాయాల వారికి అమర్చుతున్నామన్నారు. స్మార్ట్‌మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పించి తర్వాత గృహవినియోగదారులకు ఇంటికి అమర్చుతామన్నారు. ఎఈఈ కృష్ణయ్య, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రకృతి వ్యవసాయ రైతులకు ఆర్గనిక్ సర్టిఫికేషన్స్



చిల్లకూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయ రైతులకు ఆర్గనిక్ సర్టిఫికేషన్స్ ఉచితంగా అందించనున్నట్లు ఏడిఏ గోపినాయక్ తెలిపారు. గురువారం గూడూరు, ఓజిలి, చిల్లకూరు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఏడిఏ గోపినాయక్ ఎన్‌పిఎం షాప్స్ బలోపేతంపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఏడిఏ మాట్లాడుతూ ప్రతి ప్రకృతి వ్యవసాయ రైతు ఈ అవార్డును వినియోగించు కోని స్వయం సహాయక సంఘాల ద్వారా సంఘాలలో ఉండి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళ రైతులను ఒక లోకల్ గ్రూప్‌గా ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను అమ్ముకోవడానికి ఆర్గానిక్ సర్టిఫికేషన్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్ఎఫ్ఏ మధు, ఎంటి సత్యనారాయణ, తిరుమల పాల్గొన్నారు.

## బాలిరెడ్డిపాలెంలో పొలం పిలుస్తుంది

వాకాడు, నవంబర్ 14 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమములో భాగంగా రైతులకు వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమమును సద్వినియోగం చేసుకోవాలని వాకాడు వ్యవసాయ శాఖ అధికారిని దీప తెలిపారు. గురువారం మండలంలోని బాలిరెడ్డి పాలెం, మొలగనూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి వలన కలుగు ప్రయోజనాలు, సీజన్లో నారు మడి, బీజామృతంతో విత్తన శుద్ధి, ఎరువుల వలన కలుగు ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వ్యవసాయ సహాయకులు హర్ష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయండి : ఎంపిపి



నాయుడుపేట టౌన్, నవంబరు 14 ప్రభాతవార్త : జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి అధికారులను కోరారు. ఆమె ఆధ్వర్యంలో గురువారం నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి మాట్లాడుతూ ఉపాధిహామి పథకం ద్వార గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువలు, పశువుల షెడ్‌లు, పంటకాలువలు, చెరువులు పూడికతీత అబివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు ఈ సమావేశంలో ఎంపిడిఓ సురేష్‌బాబు, డిప్యూటి తహసిల్దార్ రాజేంద్ర, సిడిపిఓ హైమావతి, ఎవో గణేష్, ఉపాదిహామి ఎపిఓ షీలు, ఐకెపి ఎపిఎమ్ శారద, ఎంపిటిసి పల్లమాల రామిరెడ్డి, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శిలు, ఎఈలు తదితరులు పాల్గొన్నారు.

## గుంటల మయంగా మారిన ఆర్అండ్‌బి రోడ్డు



సూళ్లూరుపేట, నవంబర్ 14 ప్రభాతవార్త : ప్రభుత్వాలు మారుతున్నాయ్.. పాలకులు మారుతున్నారు. గత రెండు దశాబ్దాలుగా సూళ్లూరుపేట నడిబొడ్డులోని ఆర్అండ్‌బి రోడ్డు గతి మాత్రం మారడం లేదు. ఈ రొచ్చుగుంటలు తరచూ ప్రజల సహనానికి పరీక్ష పెడుతూ వెక్కిరిస్తున్నట్లుంది. 2001వ సంవత్సరంలో డివైడర్లు ఏర్పాటు చేసి రోడ్డును విస్తరించి తారు రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డుపై అప్పుడప్పుడు ప్యాచ్‌లతో సరిపెడుతున్నారే గాని శాశ్వత ప్రాతిపదికన పనులు మాత్రం చేపట్టడం లేదు. ఈ మధ్య కాలంలో ఫోర్‌లైన్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డుపై ఒక్క లేయర్ తారురోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేవారు నరకం చూడాల్సిందే. స్థానిక హోలీక్రాస్ బైపాస రోడ్డు కూడలి నుంచి లలితా జ్యుయలరీ సెంటర్ వరకు ఈ రోడ్డు పెద్ద గుంతలుగా తయారై బురదమడుగును తలపిస్తుంది. ప్రస్తుతం ఈ రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రభుత్వం సంకల్పించి కేవలం రూ.30 లక్షలు మాత్రం కేటాయించినట్లు సమాచారం. ఈ రూ.30 లక్షలతో ప్యాచ్‌లు వేసి సరిపెట్టేందుకు అంచనాలు తయారయ్యాయి. ప్యాచ్‌లు వేస్తే కొద్దిరోజులకే అవి తిరిగి గుంటలుగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ నిధుల కొరత పేరుతో ప్రధానమైన ఈ రోడ్డును నిర్లక్ష్యం చేస్తున్నారు. రోడ్డును ఇప్పటికైనా స్పందించి బాగు చేయకపోతే భవిష్యత్‌లో అసలు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడేందుకు కూడా ఈ రోడ్డు కారణమవుతుంది. ప్రధాన కూడలి నుంచి ఈ మార్గంలోకి అప్రోచ్ రోడ్లు కలుస్తుంటాయి. ఈ రోడ్డుకు ఎంత ప్రాధాన్యత ఉందో గతంలో ఉన్న నేతలకు గాని, ప్రస్తుతం ఉన్న నాయకులకు గాని తెలిసినా శాశ్వత పరిష్కారం వైపు దృష్టిపెట్టకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## మిట్టవడ్డిపల్లి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం



డక్కిలి, నవంబరు 14 ప్రభాతవార్త : డక్కిలి మండలం మిట్టవడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం వేడుకగా సాగింది. ఆ గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు తిరుపతి పెంచలయ్య విద్యార్థులకు స్టీలు బాక్సులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ నేటి బాల బాలికలను రేపటి భావిభారత పౌరులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యయురాలు ప్రభావతి, ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో సిపిఎం ప్రజా పోరు



సూళ్లూరుపేట, నవంబర్ 14 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ప్రజా పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నిత్యావసరాల ధరలు అదుపు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, మండల కార్యదర్శి చంద్రశేఖర్, అల్లెయ్య, లక్ష్మయ్య, పద్మనాభయ్య, మునెయ్య, వెంకటేశ్వర్లు, సాంబశివయ్య, బాలగురవయ్య, గిరిజన దప్పు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో బాలల దినోత్సవం



సూళ్లూరుపేట, నవంబర్ 14 ప్రభాతవార్త : సూళ్లూరు పేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని చాచా నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వీరికి పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రవంలో పాఠశాల ఛైర్‌పర్సన్ కుయల్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీహరికోట రేవతి, ఆచార్య భరద్వాజ సేవాసంస్థ మహిళా సభ్యులు లలితమ్మ, ప్రసూనమ్మలు పాల్గొన్నారు.

## అద్భుత జ్ఞాపకశక్తికి అధికారుల అభినందన



తడ, నవంబర్ 14 ప్రభాతవార్త : అద్భుతమైన జ్ఞాపకశక్తితో ఇటీవల పలువురి ప్రశంసలు అందుకున్న తడ మండలం రామాపు రానికి చెందిన 2వ తరగతి చదువుతున్న పి.ఎం.జయ మిత్రన్ బాలల దినోత్సవం సందర్భంగా గురువారం విద్యాశాఖ అధికారులు అభినందించారు. తడ మండలం రామాపురం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పి.ఎం.జయమిత్రన్ అనే బాలుడు కలామ్స్ వరల్డ్ రికార్డులో వందమంది శాస్త్రవేత్తల పేర్లు, వారు కనిపెట్టిన వాటిని చెప్పి ఒక సంచలన బాలుడయ్యాడు. ఆ విద్యార్థి అమోఘ జ్ఞాపకశక్తికి గాను మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఇతరులు బహుమతులు అందజేశారు. ఈ వందమంది శాస్త్రవేత్తల పేర్లు, వారు కనిపెట్టిన విజ్ఞానం గురించి కేవలం రెండు నిమిషాల 40 సెకన్లలో ఈ బాలుడు చెప్పినట్లు, అక్టోబర్ 25న ఈ సంఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. కేవలం ఆరేళ్ల 5 నెలల వయస్సులో జయమిత్రన్ సాధించిన ఈ రికార్డు తమ గ్రామానికి ఎంతో పేరు తెచ్చిందని రామాపురం వాసులు చెప్పున్నారు. కలామ్స్ వరల్డ్ రికార్డు ఫౌండర్ మరియు ఛైర్మన్ టి.కుమరవేల్ తరపున విద్యార్థికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

## ఘనంగా బాలల దినోత్సవం



కోట, నవంబర్ 14 ప్రభాతవార్త : కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఇఓ మస్తానయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బాల కార్మిక రహిత, బాల్య వివాహ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాలల హక్కులు, వారికి ఉన్న రక్షణ గురించి గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. పిల్లలు మొబైల్ వ్యసనానికి దూరంగా ఉండాలని, అవసరమైన మేరకే మొబైల్ వినియోగించాలని కోరారు. ప్రతి బాలికా బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సహాయం



కోట, నవంబర్ 14 ప్రభాతవార్త : మేజర్ పంచాయతీ కోటలోని శ్యామసుందర పురంలో పేద విద్యార్థి కరుణ నెల్లూరులోని రత్నం కళాశాలలో చదువు కుంటుంది. కొన్ని కారణాల వలన ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతుంది. ఈ నేపథ్యంలో కరుణ తల్లిదండ్రులు కోటలోని శ్రీషిరిడీ సాయి అక్షయ సేవాసమితి వారిని కలిసి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో షిరిడీ సాయి అక్షయ సేవాసమితి ఛైర్మన్ అల్లం రమణయ్య దాతల ద్వారా రూ.10 వేలు అందజేశారు.

## అల్పపీడనం.. మూడోరోజు వర్షం



కోట, నవంబర్ 14 ప్రభాతవార్త : అల్పపీడన ద్రోణి ప్రభావంతో కోట మండలంలో వరుసగా మూడోరోజు గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే వర్షాలతో రోడ్లు ఛిన్నాభిన్నమై ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరోపక్క ఈ వర్షం అన్నదాతలకు ఎంతో ఊరటనిస్తోంది. దుక్కులు దున్ని వరినాట్లు వేసేందుకు కర్షకులు నిమగ్నమయ్యారు. గూడూరు డివిజన్ పరిధిలోని అతిపెద్ద చెరువైన పెన్నక్క చెరువుకు జలకళ సంతరించుకుంది.

## ఇంటింటా సర్వే ప్రారంభం



కోట, నవంబర్ 14 ప్రభాతవార్త : క్యాన్సర్ మహమ్మారిని అరికట్టడంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. గురువారం నుంచి కోట మండలంలో స్క్రీనింగ్ పరీక్షలకు వైద్యశాఖ ఇంటింటికి వెళ్లి దంత, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, నోటి క్యాన్సర్ బాధితులను గుర్తించే పనిలో పడ్డారు. వైద్యాధికారుల సహకారంతో ఇప్పటికే శిక్షణ పొందిన ఎఎన్ఎంలు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు.

## ముమ్మరంగా టిడిపి సభ్యత్వ నమోదు



సూళ్లూరుపేట, నవంబర్ 14 ప్రభాతవార్త : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని సాయినగర్‌లో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చెంగాళమ్మ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మర్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఎజి కిషోర్, మేడా సాయినారాయణ, కె.శ్రీధర్, ఎల్.కొండయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా

సూళ్లూరుపేట, నవంబర్ 14 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణానికి సమీపంలోని మన్నారుపోలూరు క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం చెన్నై వైపు వెళుతున్న కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసుల సమాచారం మేరకు, ఒక వ్యక్తి మోటార్‌బైక్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఇది చూసిన మరో వ్యక్తి అతన్ని కాపాడేందుకు తన బైక్‌ను ఆపగా, వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కంటైనర్ డ్రైవర్ ఈ దృశ్యాన్ని చూసి బ్రేక్ వేశాడు. దాంతో కంటైనర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మానాయుడు తన సిబ్బందితో వెళ్లి టోల్‌గేట్ సిబ్బంది సహకారంతో కంటైనర్‌ను పక్కకు తొలగించి జాతీయ రహదారిపై రాకపోకలను పునరుద్ధరించారు.

## నాయుడుపేటలో ప్రజాపోరు



నాయుడుపేట టౌన్, నవంబరు 14 ప్రభాతవార్త : నాయుడుపేట సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు ప్రజాపోరులో బాగంగా తహసిల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహిం చారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు శివకవి ముకుంద మాట్లడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుండి గతనెల రోజులుగా కూరగాయాలు, నిత్యవసర సరుకులు ధరలు ఆకాశానంటుతున్నాయని ఆరోపించారు. అనంతరం తహసిల్దార్‌కు విన్నతిపత్రం అందజేశారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్.మహేష్‌బాబు, రజిక సంఘనాయకులు పుట్టయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్‌పి

నాయుడుపేట టౌన్ నవంబరు 14 ప్రభాతవార్త : నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌ను డిఎస్‌పి చెంచుబాబు గురువారం తనిఖీ చేశారు. అనంతరం పలుకేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. డిఎస్‌పి చెంచుబాబు మాట్లడుతూ నాయుడుపేట పట్టణంలో చోరీలు జరగకుండ రాత్రిసమయంలో గస్తీ పెంచాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడంపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ట్రాపిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా యువత బజారువీదుల్లో బైక్‌రాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సిఐ బాబు, ఎస్ఐ శ్రీహరి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## సర్వే రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపు



చిల్లకూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలోని కడివేడు రెవెన్యూ గ్రామంలో ఉన్న సొసైటీ గోడౌన్ ఆవరణంలో ఉన్న సర్వే రాళ్ళ పై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బొమ్మ, పేర్లు తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు పచ్చ వెంకటేశ్వర నాయుడు, ముస్లిం మైనారిటీ నాయకుడు మజీద్, విలేజ్ సర్వేర్లు శశి, తరుణ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



గూడూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : గూడూరు మండలంలోని చెన్నూరు జడ్పి బాలికల హైస్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మట్టెం శ్రావణి విచ్చేసి బాలికలకు తన అమూల్యమైన సందేశాన్ని అందించారు. ముఖ్యంగా ఆడపిల్లలపై జరుగుతున్న అనేక దురాచారాలు గురించి లైంగిక వేధింపులు గురించి తమను తాము ఎలా రక్షించుకోవాలో వివరించారు. అనంతరం చిన్నారులకు శ్రావణి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మెహబూబీ, సూపర్‌వైజర్ శివజ్యోతి, స్కూల్ హెచ్ఎం మమూల అంగన్‌వాడి టీచర్స్ పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన గనులు : ఎంఈఓ



వెంకటగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త: గ్రంథాలయాలు విజ్ఞాన గనులు అని ఎంఈఓ తోట వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటగిరి తూర్పు వీధిలోని గ్రంథాలయంలో బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులు పెద్దలకు ఉపయోగపడే విధంగా అన్ని రకాల పుస్తకాలు, దినపత్రికల ద్వారా విజ్ఞానం దొరుకుతుందని తెలిపారు. గ్రంథాలయ అధికారి అంజయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




వెంకటగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్ బాలల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా బాలికల కోసం ఫోక్స్ చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ తులసిజ్యోతి, న్యాయవాదులు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

బాలాయపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త : ఈనెల 23వ తేదీ జరగవలసిన సాగునీటి సంఘాల ఎన్నికలు అసెంబ్లీ సమావేశాల వల్ల ప్రభుత్వం వాయిదా వేసినట్లు జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబిరెడ్డి తెలిపారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో 70 చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగవలసినట్లు తెలిపారు. ఈ నెల20 ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వవలసి ఉండగా వాయిదా పడినట్లు తెలిపారు. ప్రాదేశిక నియోజకవర్గంలో ఆరు మందిని ఎన్నుకుంటారని వారిలో ఒకరిని ప్రెసిడెంట్‌గా, మరొకరిని వైస్ ప్రెసిడెంట్‌గా, మిగిలిన నలుగురు సభ్యులుగా ఉంటారని చెప్పారు. ప్రెసిడెంట్ కాలు ఐదు సంవత్సరాలు ఉంటుందన్నారు. మరలా ఎన్నికలు తేదీని ప్రభుత్వం ప్రకటిస్తుందని వివరించారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.31 కోట్లు ఆదాయం



కాణిపాకం, నవంబర్ 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.31 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. గురువారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 22 రోజులకు గాను హుండీల ద్వారా 1,31,12,759 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 19 గ్రాముల బంగారు, 1 కిలో 420 గ్రాముల గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 11,360 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 28,646 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 376 అమెరికా డాలర్లు, 75 యుఏఈ దినార్స్, 1 మలేషియా రింగిట్స్ 75 ఇంగ్లాండ్ ఫౌండ్స్ 60 యూరో కరెన్సీ, ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలురవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, హుండీ ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యంనాయుడు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## చలికి వణుకుతూ విద్యార్థుల స్నానాలు - పూతలపట్టు బాలుర హాస్టల్

పూతలపట్టు, నవంబర్ 14 ప్రభాతవార్త: పూతలపట్టు బాలుర వసతి గృహ విద్యార్థులు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నారు. విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలను సైతం కల్పించడంలో అధికారులు విఫలం అవుతుండటంతో విద్యార్థుల పరిస్థితి దీనంగా మారింది. పూతలపట్టు బాలుర హాస్టల్‌లో ప్రస్తుతం 64 మంది విద్యార్థులు వున్నారు. వీరు ప్రతిరోజు స్నానం చేయడానికి హాస్టల్ ఆవరణలో నాలుగు స్నానాల గదులు వున్నాయి. అయితే స్నానపు గదులు శుభ్రంగా లేకపోవడంతో గదువల బయట వున్న కొళాయిల్లో విద్యార్థులు స్నానం చేసి పాఠశాలకు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరు బయట ఒకేసారి అందరు విద్యార్థులు తెల్లవారుజాము స్నానం చేయాలంటే ప్రస్తుతం చలికాలం కావడంతో విద్యార్థులు చలిలో వణుకుతూ స్నానం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా హాస్టల్ అధికారులు విద్యార్థుల స్నానాల గదులను సిద్ధం చేసి స్నానపు గదుల్లోనే విద్యార్థులు స్నానం చేసేలా ఏర్పాట్లు చేయాల్సివుంది.

## జిల్లా ఎస్పీచే తవణంపల్లె పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



తవణంపల్లె, నవంబర్ 14 ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు గురువారం తవణంపల్లె పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, వివిధ క్రైమ్ రికార్డులను పరిశీలించారు. అలాగే స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సమీక్షించారు. ముఖ్యంగా డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పురోగతి, నిందితుల అరెస్ట్ వంటి వాటిపై సమీక్షిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి త్వరిగతిన కేసుల దర్యాప్తు పూర్తి చేసి, కోర్టుల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా వుంచాలని, నేరాల నియంత్రణకు నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ మణికంఠ సూచించారు. అలాగే పోలీస్‌స్టేషన్ సీజ్ చేసిన వాహనాలను డిస్పోజ్ చేయాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడుగూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సిబ్బంది సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్సై చిరంజీవి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి, నవంబర్ 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా టి.బాపిరెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారి అంతర్గత బదిలీలు చేపట్టారు. గతంలో పని చేస్తున్న స్థానాలతో పాటు అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎఇఓ వైసతీష్‌మాలిక్‌ను లీగల్ ల్యాండ్స్ ప్రోటోకాల్‌తో పాటు అధనంగా లీగల్, రాహుకేతుదోష నివారణ పూజల మెటీరియల్ ప్యాకింగ్ అన్నదానం గోశాలల పర్యవేక్షణ అప్పగించారు. మరో ఎఇఓ కె.విద్యాశాగర్‌రెడ్డిని ప్రోటోకాల్ పిఆర్‌ఓగా బాధ్యతలు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ కె.సురేష్‌రెడ్డి ఫోటోతో పాటు అధనంగా రాహుకేతుదోష నివారణ పూజల ప్యాకింగ్ బాధ్యత అప్పగించారు. జి.దుర్గా ప్రసాద్‌ను అధనంగా ఎపిఆర్ఓ, రాహుకేతుదోష నివారణ టిక్కెట్లు కౌంటర్ బాధ్యతను అప్పగించారు. కె. శ్రీనివాసులును సిఆర్ఓను అదనంగా పిఆర్ఓ ఆఫీస్ బాధ్యతలు అప్పగించారు. సుబ్బరామయ్య ప్రస్తుతం శానిటేషన్ పర్యవేక్షిస్తుండగా ఆతన్ని సిఆర్ఓ కార్యాలయానికి బదిలీ చేసారు. రిసెప్షన్ బాయ్‌కు ఆర్ సాయి ప్రసాద్ ప్రసన్నవరదరాజస్వామి అతిధి గృహం పర్యవేక్షిస్తుండగా పిఆర్ఓ కార్యాలయానికి మార్చారు. డ్రైవర్‌గా ఉన్న కోటేశ్వరరావును స్కానింగ్, రూ.50 ల ప్రవేశ టిక్కెట్లు బాధ్యతను అప్పగించారు. సాయిచంద్రకాంత్‌కు గార్డినింగ్‌తో పాటు రూ.750ల రాహుకేతుదోష నివారణ మండపం బాధ్యతను అప్పగించారు. వి.లక్ష్మీరెడ్డిని వరదరాజస్వామి అతిధి గృహానికి బదిలి చేసారు. పి.చెంచుకుమార్‌ను స్కానింగ్, రూ.50ల టిక్కెట్లు బాధ్యతను అప్పగించారు. బాలసుబ్రమణ్యంను పిఆర్ఓ కార్యాలయానికి బదిలి చేసారు.

## వేదవ్యాస స్కూల్లో కాన్సర్ ఉచిత వైద్య పరీక్షలు



పుత్తూరు, నవంబరు 14 ప్రభాతవార్త : స్థానిక వేదవ్యాస స్కూల్లో గురువారం ఉచిత క్యాన్సర్ వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. నోరు, రొమ్ము, గర్భ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ పి.వి.హేమంత్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను ముందుగానే తెలుసుకుంటే క్యాన్సర్ బారిన పడకుండా చికిత్స అందించవచ్చని తెలిపారు. మధ్యాహ్నం స్కూలు పిల్లలకు కూడా క్యాన్సర్‌పై అవగాహన కలిగించారు. సిగరెట్లు, మత్తు పానీయాల వినియోగం ఆరోగ్యాన్ని ఏ విధంగా దెబ్బతీస్తుందో వివరించారు. ఎస్వీ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు సి.నారాయణబాబు మాట్లాడుతూ స్కూలు సిబ్బంది ఆరోగ్యంగా వుండాలనే సదుద్దేశ్యంతో ఉచిత క్యాన్సర్ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల సకాలంలో చికిత్స పొందలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. శిబిరంలో మొత్తం 150 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదవ్యాస విద్యా సంస్థల డైరక్టర్ ఎం.వేదవ్యాస్, క్యాన్సర్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ వెంకయ్య బాబు, సిబ్బంది రెడ్డి కుమారి, మెహతాజ్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దమ్ము ధైర్యం...మాజీ మంత్రి రోజా సొంతం!



నగరి, నవంబరు 14 ప్రభాతవార్త: రోజా అంటే ఫైర్ బ్రాండ్ ప్రస్తుత రాజకీయాల్లో దమ్ము ధైర్యం ఉన్న ఏకైక నాయకురాలు మాజీ మంత్రి రోజా. ఎన్ని దుష్ప్రచారాలు, ట్రోలింగులు చేసినా జడిసిపో కుండా ధైర్యంగా పార్టీకోసం మాట్లాడుతున్న దమ్మున్న నేత ఆమె. వైసీపీలో 151 మందిఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, కార్పొరేట్ ఛైర్మన్‌లు ఇలా వందలాది మందిపదవులు అనుభవించిన వారు ఇప్పుడు ఎక్కడా కనపడడం లేదు. కానీ రోజా మాత్రం ధైర్యంగా నిలబడిపార్టీ కోసం పోరాడుతున్నారు. సోషల్ మీడియా అరెస్టులకు జడిసి నాయకులంతా దాక్కొని కూర్చుంటే రోజా మాత్రం ధైర్యంగా ముందుకొచ్చి మాట్లాడుతున్నారు. ధైర్యంగా, స్పష్టంగా విశ్లేషణాత్మకంగా ఎలాంటి దుర్భాషలు లేకుండా తన వాణిని అద్భుతంగా వినిపిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిర్మాణాత్మకంగా నిర్భయంగా ప్రసంగిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన వారంతా ఇప్పుడు ప్రతి పక్షంలో దాక్కొని ఉంటే రోజా మాత్రం ధైర్యంగా నిలబడి కలబడుతున్నారు. తమిళనాడులో విజయ్ పార్టీలో చేరుతారు అని టీడీపీ వాళ్లు, పచ్చ మీడియా ప్రచారం చేసినా పట్టించుకోకుండా వైసీపీ కోసం ధైర్యంగా నిలబడి పోరాడుతున్నారు. రోజా చదువుకునేటప్పుడు కాలేజీలో, ఇంటిలోను ఒక్కమగాడు అని పిలిచేవారంట. పార్టీ కష్ట కాలంలో నాయకులంతా కనబడకుండా దాక్కుని ఉన్న ఈ సమయంలో నిర్భయంగా వచ్చి పోరాడుతున్న ఆమె మరోసారి ఒక్కమగాడు అని నిరూపించుకుంటుంది.